

ప్రతిఘంటలు
చంద్ర

గుండెక్కినాడు బాలిగాడు!

పులిగుండెక్కినాడు బాలిగాడు! పులిగుండు మీద నిలబడి ఉధృతంగా వీస్తున్న గాలికి పోరకపుల్లలా ఊగిసలాడుతున్నాడు బాలిగాడు! అబ్బ! ... పులిగుండు!!—

తల పైకెత్తి చూస్తే తలగుడ్డ కింద పడిపోయే గుండు. కలిగిన వాని కంటి కాపరానికి ప్రతీకగా, లేనివాడి పేరాసల పేర్పుకు పతాకగా నిలబడ్డ గుండు. గుండె కలిగిన లేజవరాలి జీవితంతో చెలగాటాలాడి, వెన్న వంటి మనసును మన్నుచేసిన గుండు! అబ్బ!....పులిగుండు!!

ఆ గుండెక్కినాడు బాలిగాడు!

ఉగ్రాణంపల్లె ఓ కుగ్రామం. ఆ ఊరికి ఉత్తరంగా....ఊరి పొలిమేరల్లో వెలసిన గుండు—కాలగమనంలో చాల చరిత్రను సముపార్జించుకొనింది.

ఆ ప్రాంతాల్లో పేరుమోసిన గజదొంగ అంబోదల గిడ్డడు. గిడ్డడి మాట వింటే పసిబిడ్డ పాలు తాగటం మాని, గుక్కపూని యేడ్చేదట. తెల్ల

దొరలే వాడి విపరీత చర్యలకు తెల్లబోయేవారట. ఫలానా చోట, ఫలానా వేళకు దొంగతనం చేస్తానని చాటి... బందోబస్తులో వున్న బంట్రోతు మొగాల కింత మసి పూసి, ఆ ప్రక్రియలో సాటి లేదనిపించుకొన్న మేటి— అంబోదల గిడ్డడికి ఆశ్రయ మిచ్చిన గుండు! గుండు గుండెల్లో ఆశ్ర యమా? అంటే— ఆ గుండు రెండుగా చీలివుంది. ఆ చీలికలో గజదొంగ అంబోదల గిడ్డ దాక యేలిక! ఆ వూళ్ళో కామసాని రంగవల్లి అందరికీ తలలోని నాలుక! రంగవల్లి రంగు మాగిన నిమ్మపండు పొంగు ... రంగ వల్లి ఓరగంటి చూపు దోరవయసు కోర్కెల గుబాళింపు.... పిడికెట్లో యిమిడే నడుము.... పట్టు రవికలో యిమడలేక పాటుపడే వక్షస్థలము.... నడకలో వయ్యారము.... మాట మాటలో నయగారము.... అందినట్లు అంది, అందకుండా దూరంగా వుండి, అందుకోలేని అమాయకులు— మొగం మాడుస్తూ వలవలా ఏడుస్తూ వుంటే, కిలకిలా నవ్వే రామచిలుక రంగవల్లి! ఆ వూళ్ళోకి ఎలా వచ్చి వాలిందో ఎవరికీ తెలియదు.

రంగవల్లి వచ్చింది ఆ వూరికి. వస్తూవస్తూ ఏమి తెచ్చుకొనిందో ఎవరికీ తెలియదు. కానీ వెంటదెచ్చుకొనిందొక ముద్దులు మూటగట్టే పసిపాపను! అయి దేండ్ల అందాల చిట్టిపాపను! ఆమె ఆ వూళ్ళో అడుగుబెట్టిన మూడంటే మూడు నెలలకు మూడంతస్థుల మేడ పైకి లేచింది. రంగవల్లికి, అంబోదల గిడ్డడికి యేదో వుందన్న పుకారు గాలిలో లేచింది. ఆ పుకారు రంగవల్లి బ్రతుక్కే ఒక పూలబాట నమర్చిపెట్టింది. ఆ బాటపై ఆమె బ్రతు కొక షికారయింది. చిన్నా పెద్దా, బీదా బిక్కీ అందరూ తరతమ భేదాలు లేకుండా ఆమెకు నమ స్కరిస్తుంటారు. ఆమె వాళ్ళను గౌరవిస్తూ ఉంటుంది. అది ఉత్తుత్త గౌరవం కాదు. మహాకవులకు కేవలం దుశ్శాలువలాంటి గౌరవం కాదు. ఆమె పాత్రమెరిగిన గుప్తదానాలు చేస్తూ ఉండేది. గొంతు కోరికి నెత్తురు తాగుదామన్న కసితో మసిగానున్న కొన్ని సంసారాలను నేర్పుగా ముడి వేసింది. రంగవల్లి రంగమ్మ తల్లిగా మారింది. రంగవల్లి రంగమ్మ తల్లిగా మారే కాలానికి అయిదేండ్ల అందాల పసిపాప రాణెమ్మగా రూపొందింది.

రాణెమ్మ!....నిజంగా ఝూన్సీరాణెమ్మ! ...ముద్దబంతి పూవులాంటి జవరాలు రాణెమ్మ జల్సాగా తిరిగేది. అందాలరాణెమ్మ అందరితో అరమరికలు లేకుండా మాట్లాడేది. ఎప్పుడైనా, ఎక్కడైనా కాస్త మాట పొర్లిందంటే చాలు! పోట్ల గిత్తలా పోట్లాడేది. ఝూన్సీ ధైర్యవంతురాలే! ఆ వూళ్ళో ఇంతో అంతో గౌరవముంది తనమీద. నిజమే! భర్త అజ్ఞాతశక్తి ఆమెకు రక్షగా వుంది. వాస్తవమే?... అయినా రాణి ఆడపిల్లని, రంగవల్లికి బాగా తెలుసు. పట్టుతప్పిన ఆడది—గట్టు తప్పిన గంగని, సంఘానికి కంటిలో నలుసని కూడ తెలుసు. అందుకే ఆమె రాణెమ్మకు ఓ రాజును జత చేయాలని తాపత్రయపడసాగింది. అయితే ఝూన్సీరాణీ ఆ సమస్యను చాల చిత్రంగా పరిష్కరించింది.

'పులిగుండెక్కిన మొనగాడు నా మొగుడు!' అనింది.

క్షణం నిర్విణ్ణురాలయింది రంగవల్లి. గుణం మార్చుకోమని కూతుర్ని ప్రాధేయపడింది రంగవల్లి 'పులిగుండెక్క కలిగిన మొనగాడు పుట్టి వున్నాడా?' అని బెంగపడింది రంగవల్లి. ప్రాధేయపడి, కోపపడి, మాటలు మానికూడ కూతురి మనస్సు మార్చలేక పోయింది రంగవల్లి. మానవ యత్నం మంట గలిసేసరికి, దైవనిర్ణయంకోసం ఎదురుచూడ సాగింది రంగవల్లి.

ప్రకటనలు ఊరి పొలిమేరలు దాటని ఆ రోజుల్లో పాయకట్టు పాయకట్టుగా ఉడికిపోయింది. తలకొక్కతీరుగా మాట వెలువడుతూ ఉంది. 'అబ్బరు తగిన కూతుర్రా!' అని ఒకడంటే, 'ఈ సాకుతో చస్తేకూడా అదృష్టమేరా!' అని మరొక్కడంటున్నాడు.

'అదేం పొయ్యేకాలమో ఆ అమ్మికి. బంగారు బొమ్మ మాదిరుంది. కోరకుండా, కోరకుండా గొంతెమ్మ కోరిక కోరిందే!' పులిగుండెక్కేదెవడో? ఆ పిల్ల మెళ్ళో పుస్తెగట్టేదెవుడో?'_పెద్దలు వాపోతున్నారు. ఆ పాయకట్టులో మీసకట్టు యేర్పడ్డ ప్రతి కుర్రవాడి నోట్లో నీళ్ళూరాయి. పులి గుండు మాట వినులో మెదిలేసరికి నీళ్ళు గారాయి! అన్నింటినీ సవాలు

చేస్తూ కొదమసింగం లాంటి కుర్రవాడు....కురుకురు మీసాలవాడు....కలిగిన యింటి గారాబాలు తిని పెరిగినవాడు...యూన్సీ దొరవయసు మీద ఓ కన్ను వేసి వుంచినవాడు....ముందుకురికాడు. కన్న పేగులు లబోదిబోమని మొత్తు కొన్నాయి. పెద్దలు హెచ్చరించారు. కావలసినవారు వారించారు. కాదంటే అవుననన్నాడు. కాళ్ళకు బంధాలు....నడుముకు దారం... అన్నీ పకడ్బందీగా అమర్చుకొన్నాడు. పాయకట్టులో ప్రజ పులిగుండు చుట్టూ నిలబడింది. ఎవరి ఊహల్లో వారు తేలిపోతున్నారు. యూన్సీ యింట్లో దేవుని ముందు కూర్చుని పూలమాలను కడుతూ వుంది అందంగా!....

కోడెవయసు పిల్లవాడు....పేరుకు జగన్నాధుడు....ఉడుము పట్టుతో ఉడతలా ప్రాకుతున్నాడు. గుమిగూడిన అమ్మలక్కలు దవడలు నొక్కు కొంటున్నారు. యువకులు మీసం దువ్వుతున్నారు. పెద్దలు ముక్కున వేలేసుకొంటున్నారు.

"సెహభాస్ జగ్గూ!....సెహభాస్ యూన్సీ జగన్నాధ్!—పులిగుండె క్కిన పులిబిడ్డరా నువ్వు!" కరతాళధ్వనుల మధ్య గొంతు చీల్చుకొని పలి కింది యువతరం.

ఊరికీ పులిగుండుకు మధ్య సేతువులా నిలబడిన జనసందోహములో జగన్నాధుడు పులిగుండెక్కిన మాట—అలలాప్రాకి యూన్సీ చెవులసోకింది. అసలే అపరంజి ముద్ద....పెండ్లి కూతురయింది. ఇక చెప్పాలా? చూడ డానికి కండ్లు చాలడంలేదు. పూలమాలను చేతబట్టి, ఎన్నడూ లేనిది సిగ్గు బరువుతో తలను ఒకింత వంచిపట్టి, బయలుదేరుతూ వుంది.

'అయ్యో! కొంప కూలిందే!' అన్నారెవరో!

మాట పూర్తి అయి కాకమునుపే జగన్నాధుడి శరీరం పులిగుండు కింద రక్తపు మడుగులో ముద్దలా తేలింది. తీరా గుండు పైభాగాన్ని చేరే సమయానికి ఎలా కాలుజారిందో? జగన్నాధుడు ...అభము శుభము ఎరుగని కుర్రవాడు....ఆడదాని పంతంతో ప్రభావితుడైనవాడు....అందరాని అందం కోసం అర్రులు చాచినవాడు....అందాల బాలుడు—ఇప్పుడొక రక్తపు ముద్ద.

ఏది మొండెము? ఏవి కాళ్ళు? ఏవి చేతులు? అని తెలుసుకోలేని రక్తపు ముద్ద. ఆ రక్తపు ముద్దకు ఎడతెగని కన్నీటి అభిషేకం జరుగుతూ వుంది. క్షణాల్లో పరుగులు దీసిందీ వార్త. పొలిమేరలుదాటి ఊళ్ళో ప్రవేశించింది.

'అదో! రాణెమ్మ వచ్చిందన్నారెవరో?'—ఆ మాటతో జనసందోహం పాయలుగా చీలి దారియిచ్చింది.

ఝాన్సీ నడుస్తూ ఉంది. కాదు—మూర్తీభవించిన శోకదేవత అడుగు దీసి అడుగుపెట్టూ ఉంది. అందరూ అటువైపు చూశారు. దిగ్భ్రమచెందారు. నుదుట కుంకుమలేదు. చేతుల్లో గాజులులేవు. వీడిన కురులు....విడువని మరులు....వేలాది కండ్లు వర్షించి వాగులైతే ఆ వాగులో ఆమె ఈదు కొంటూ వస్తూ ఉంది. వచ్చింది. రక్తపు మడుగును సమీపించింది. ఒక్క క్షణం నిశ్చలంగా చూచింది. మరొక్క క్షణం బావురుమంటూ ఆ మడుగులో పడి పొర్లింది. ప్రళయ కాళిలా, తోకతొక్కిన త్రాచులా చివుక్కున లేచింది. ఒక్కక్షణం పులిగుండు వైపు తీక్షణంగా చూచింది. గిరుక్కున వెనక్కు తిరిగింది. వచ్చిన వ్యక్తి వచ్చినట్లుగా వెళ్ళిపోయింది.

రంగవల్లి మధనతో మంచమెక్కింది. ఎక్కిన మంచం దిగకుండా ఆమె వెళ్ళిపోయింది. శక్తియుక్తులన్నీ ఆమెతోనే వెళ్ళిపోయాయని అంబోదల గిడ్డడు అవతారం చాలించి పట్టుబడిపోయాడు. రాణెమ్మ విరాగినిగా, మౌనయోగినిగా జీవితం గడుపుతూ వుందా పల్లెలో!....లేజవరాలి, అమాయకురాలి నిండు జీవితాన్ని బలికొన్న గుండు!

అబ్బ! పులిగుండు. ఆ గుండెక్కినాడు బాలిగాడు. గుండుమీద నిలబడి 'నిజం చెప్పేస్తా! నిజం చెప్పేస్తా!!' అని అరుస్తున్నాడు బాలిగాడు!

ఆ పాయకట్టులో ఓ పది పదిహేను గ్రామాలున్నాయి. గ్రామ గ్రామానికి ఓ గెవిని ఉంది. గెవిన్లో ఓ గ్రామ దేవత ఉంది. ఈ గ్రామ దేవతలకంతా ఓ అధిష్ఠాన దేవత ఉంది ఎమ్మెల్లే లెన్నుకొన్న మంత్రివరేణ్యుడిలాగ. ఆ అధిష్ఠాన దేవత పేరు ముత్యాలమ్మ! ముచ్చటగ పులిగుండు కింద వెలిసింది.

చుట్టూ మోకాటిబంటి ప్రహరీ మట్టిగోడ....ఆ మట్టి ప్రాకారానికి వేపచెట్టు నీడ....ఆ వేపచెట్టు నీడలో, బోదె ప్రక్కలో ముక్కోణాకృతిలో మూడు శిలలు!—ఎండ వానలను సమదృష్టితో సహిస్తూ, పక్షులు విడిచిన రెట్టను స్వీకరిస్తూ, గ్రామాలను రక్షిస్తుంటాయి. ఈ గ్రామ దేవతలకు మాత్రం అడపాదడపా పూజలు జరుగు తుంటాయి. వానలు రాకపోతే పూజ. వానలు ఎక్కువై వరదలు ఎక్కువై చెరువు కట్టలు తెగుతూంటే పూజ. ఊళ్ళో 'వాతీబేదులు' తగిలితే పూజతో కలిసి గావు!....ఇద్దరి జగడం మూడో వాడికి లాభమన్నట్టుగా గ్రామాల్లో యిద్దరి మధ్య తగాదాలు అచ్చుబండవద్ద తెగుతూ ఉంటాయి. నేరస్థుడు శిక్షింపబడతాడు. శిక్షకు మారుపేరు తప్పు. తప్పుకు ప్రతిరూపము డబ్బు. తప్పు పేరుతో కుప్ప లైన డబ్బు తరగడానికి తరుణోపాయము గ్రామదేవతల తిరణాలు. ఈ తంతుకు ధర్మకర్తలు గ్రామ కరణాలు!

అయితే అధిష్ఠాన దేవత ముత్యాలమ్మ అందమైన రాతి కట్టడములో వెలసి వుంది. ఆమెకు మాత్రము అడపాదడపా కాకుండా, అటుయిటు కాకుండా యేడాదికొక్క మాటు మహా వైభవోపేతంగా జరుగుతుంటుంది పూజ! పాయకట్టు పాయకట్టుగా కలిసి కట్టుగా ఘనంగా జరిపిస్తుందీ పూజ. చిల్లర డబ్బులకోసం దినము చేతనిచాపే గుమస్తాలు గ్రామ దేవతలైతే, యేడాదికొక్కమారుగా అంతా ఒక్కమారే గుంజుకొనే అధికారి అధిష్ఠాన దేవత ముత్యాలమ్మ. ఈ ముత్యాలమ్మ తిరణాలకు వారం రోజులు ముందు గానే పాయకట్టంతా తిరిగి 'తండోరా' వేయిస్తారు. తుడుముమీద దెబ్బపడే సరికి పాయకట్టు తన కర్తవ్యాన్ని తడిమి చూచుకొంటుంది. ఇంటింటికి పంపకం, శిలల అంపకం జరుగుతుంది. ముత్యాలమ్మ గుడికి వెల్లవేయిస్తారు. శిలలకు రంగు పూయిస్తారు. గుడిచుట్టూ అందాల పందిర వేయిస్తారు. వ్యాపారస్థులు అంగళ్ళు పెట్టుకోవడానికి గుడిసెలు వేయిస్తారు. అక్కడికి తమ పాలిటి కదొక మయసభ నిర్మాణంగా భావించి మురిసిపోతారు. తిరు నాళ్ళ నాటికి యింటి కొక్క పొంగలి విధిగా బయలుదేరుతుంది. పొంగలి

కొక్క కోడిపిల్ల, పొట్టేలు లేదా మేకపోతు తప్పక వుండి తీరుతుంది. ఉండి తీరాలి. లేకపోతే ముత్యాలమ్మ కోపగించు కొంటుందట. అది నియమము. నియమోల్లంఘన తప్పుకు దారి తీస్తుంది. అందుకు భయపడి పేదాసాదా, వున్నా లేకున్నా అప్పో సప్పో చేసి ముత్యాలమ్మకు పొంగళ్ళు పెడతారు. కలిగిన వాళ్ళు కంచి పట్టు చీరలతో....కంచు పాత్రలతో బయలు దేరితే లేనివాళ్ళు పడిపేలు యిచ్చిన ఎరవలి చీరలతో మట్టిపాత్రలతో తృప్తి పడతారు! ఈ జాతర పాయకట్టంతా కలిసి కట్టుగా జరిపించినా, ఆంతర్యంలో మాత్రం పోటీ వుంటుంది. ఒక గ్రామాన్ని వేడుకల్లో మరొక గ్రామం తల దన్నాలన్న తపన వుంటుంది అందుకే ఆ సందర్భంలో ఎవరి ప్రయత్నాలు వాళ్ళవి. సివ్వలు ఆకసంలో పేలుతాయి. మతాబులు, బాణా సంచులు కాలు తాయి. కొమ్ములు, పలకలు గెగ్గిరెట్లు మారుమోగుతాయి. "ఆనందమో! బ్రహ్మానందమో! ముత్తేలమ్మ తల్లి కానందమో!" అని పంబలవాడు పాడుతూ దరువేస్తుంటాడు. జుట్లకు పూలుచుట్టి, కాలికి గజ్జెకట్టి కుర్రకారు అడుగు కదుతూ వుంటుంది. ఐదువలు అందంగా అలంకరించుకుంటారు. అలికి పసుపు కుంకుమలు పెట్టిన పొంగలి గంపలు నెత్తిన ఉంటాయి. నడ కలో వయ్యారాల హొయలుంటుంది. మేకపోతులు. పొట్టేళ్ళు, కోళ్ళు— మరో గంటలో వాటి గతిని వూహించుకోలేక మేత కనుకొంటే—వాటి నీడ్చుకొని—మగరాయుళ్ళు వెంటబడి నడుస్తుంటారు. పిల్లలు ఆనందం పట్టలేక ఎగురుతుంటారు. మట్టిబాటలో దుమ్మంతా వాళ్ళ పరంగానే వుంటుంది. ఇంత సందడిలోకూడ పిల్లనగ్రోవి పాట పసందుగా వినిపిస్తూ ఉంటుంది. జాతర నాడు ప్రతి గ్రామము ముత్యాలమ్మ గుడికి కదిలే తీరు తెన్ను లొక కన్నుల పండువ! పల్లీయుల పాలిట కదొక పెద్ద పండుగ!!

ఆ యేడు, ఆ నాడు—బాలిగాడు పులిగుండెక్కిననాడు ముత్యాలమ్మ జాతర! పాయకట్టు పాయకట్టుగా ముత్యాలమ్మ గుడివద్ద మూగింది. దాదాపు వెయ్యి కుటుంబాలు. కుటుంబాని కొక్క పొంగలి. పొంగలి కొక్క పొయ్యి. ఆడవాళ్ళు పొయ్యి పెట్టుకోవడానికి మూడు రాళ్ళ కోసం తంటాలు

పడుతున్నారు. కొందరు పాత పొయ్యిల కోసం పేచీ పెడుతున్నారు. పిల్లలు చెంబులు, దుత్తలు తీసుకొని ప్రక్కన గుంటలో నీళ్ళు తేవడానికి పరుగులు తీస్తున్నారు. పొయ్యికి ఎండుపుల్లలు యేరుకరావడానికి మగ రాయళ్ళు బోడి గుట్టలమీద పడ్డారు. ఉత్తరజూచి ఎత్తరగంప! అదనుకోసం వేచివుండిన వ్యాపారులు, జూదగాళ్ళు పగటివేషగాళ్ళు అంతో యింతో సంపాదించుకోవడానికి సతమతమవుతున్నారు. అదొక అందమైన అలజడి. కొనితెచ్చుకొన్న సందడి. ఇక కాసేపటిలో గొంతుకోసే కోడికి నీళ్ళు తాగిపిస్తున్నాడొకడు. తలా మొండెము రెండూ రెండు తునకలుగా తెగ నరకబోయే పొట్టేలికి పిడికెడు కసువు నోటికందిస్తున్నాడు మరొకడు. కని కరము ఒలకబోస్తూ, కసాయి పనులకు ఒడిగట్టే మానవజాతిగదా మరి? మడివేలు మునిగాడు ఎండిన ముష్టి కొమ్మమీద సన్నటి యిసుకపోసి కత్తిని నూరిందే నూరిందిగా వున్నాడు. చెట్లకు, రాళ్ళకు కట్టేసివున్న పొట్టేళ్ళను, మేకపోతులను అప్పుడప్పుడొక కంట గమనిస్తూ, మరొక కంట కత్తి వాదరను తడిమి చూస్తున్నాడు. వెయ్యి పొవ్వులు వెలిగాయి. వెలుగులో మంట. మంటతో కలిసి పొగ. నీలాలు పారే పొగ నిమ్మకు నీరెత్తినట్లు నిమ్మళంగా పైకిలేచి ఆ ప్రాంతమంతా వ్యాపించింది. నింగి నేల కౌగిలించుకున్నట్టుంది. పొంగలి వండుతున్న సుందరాంగులు నేలకొంగిన నింగిలో నక్షత్రల్లా వెలుగుతున్నారు!

'నిజం చెప్పేస్తా! నిజం చెప్పేస్తా!!' గొంతు పైకెత్తి, రెండుగా చీలిన గుండు సందులో తలపెట్టి అరుస్తున్నాడు బాలిగాడు. అంత ఎత్తు నుండి అరుస్తున్నా, గాలి ఉధృతంగా వీస్తున్నా, గుండు సందులో మాటలు గంట కొట్టినట్లు వినిపిస్తున్నాయి. అందరి దృష్టి అటు మరలింది.

"బాలిగాడు పులిగుండెక్కినాడే! అదెట్లా సాధ్యపడిందబ్బా?" కొందరి ఆశ్చర్యం.

"ఒరే! ఈ మాట ఆ రాణెమ్మతో పొయ్యి చెప్పండిరా! ఆమె పండు ముసిలిదైనాక యీడు గుండెక్కినాడే! ఏం విలాబం?" మరికొందరి ఎగతాళి.

"నిజం చెప్పేస్తా! నిజం చెప్పేస్తా!!" ఇదేమీ గమనించని స్థితిలో బాలిగాడి అరుపు.

"నీ మొగం నువ్వేంది చెప్పేది నిజం?....ఇన్నాళ్ళూ చెప్పంది యిప్పుడేందిరా నువ్వు చెప్పేది నిజం పిచ్చి నా కొడకా? అణ్ణుంచి పణ్ణా వంటే పులుసులోకి ఎమిక దొరకదు. నిజం చెప్పింది సాలుగానీ దిగరా నీయమ్మా బడవా!" కొందరు అరుస్తున్నారు. కొందరు చేతులతో సైగ చేస్తున్నారు.

"అదో! అటు చూడండి!" ఉన్నట్లుండి వులిక్కిపడ్డట్టు అరిచాడు బాలిగాడు. ఎటు చూడమంటున్నాడో, ఏఁవి చూడమంటున్నాడో అర్థంకాక పోయినా అందరూ వెనుదిరిగి చూశారు.

"ఆహా! ఎంత పత్తిత్తురా! పచ్చి పసుపుకొమ్ము మాదిరుండాది. పైగా పచ్చిపసుపే సాది పూసుకొనింది. పావలా కాసంత కుంకంబొట్టు పెట్టుకొనింది! పట్టుసీర గట్టింది. నాలుగు తవ్వల పువ్వులు తల్లో తురుముకొనింది. మహా పత్తిత్తులాగ పొంగలి పెడతావుంది సూడండిరా! ఇప్పుడేఁవో పది మందిలో, యింతకుముందేఁవో ఎవుడికీ తెలియకుండా ఒకడికి పొంగలి పెట్టించింది. హహ్హాహ్హా! ఒరే! పిచ్చినాయాలి గుంపా! ఇంకా ఎవురో తెల్సుకోలా? నన్ను పిచ్చోడంటావుంట్రి గదరా పిచ్చి సన్నాసుల్లారా! అటు జూడండిరా! నిమ్మకు నీరెత్తినట్టు ఎంత నిమ్మళంగా వుందో మణిసి! పేరు నిర్మలమ్మ గదా? కొంపలు కూల్చినా గొంతులు కోయించినా నిమ్మళంగా వుండొద్దా మరి?" _ బాలిగాడి ధోరణి అర్థంకాక అందరు చెవులు రిక్కించి వింటున్నారు.

నిర్మలమ్మ! చెక్కిన బొమ్మలాంటి నిర్మలమ్మ! పాతికేళ్ళ పడుచు నిర్మలమ్మ! ఉగ్రాణం పల్లెలో ఊపిరినంతా కోర్టు కచ్చేరీలకు వెచ్చిస్తూ, తన కాళ్ళు పట్టేవాళ్ళను, కనుసన్నల్లో మెదిలేవాళ్ళను రక్షిస్తూ—కాదన్న వారిని ఓ కంట గమనిస్తూ అయిదు పదులు వయస్సు అందుకోసమే వెచ్చించిన కృష్ణమ నాయుడి జీవితములో రెండవ సతీమణిగా అడుగుబెట్టిన

అందాల బరిణె నిర్మలమ్మ! పొయ్యి రగిలిస్తూ వుంది. ఎంతకూ రగలని పొయ్యితో సతమతమవుతూవుంది. ఊది ఊది, కండ్లుబ్బి, చెక్కిళ్ళపై కన్నీళ్ళు కారుతూంటే పట్టుకోక చెడిపోతుందేమో? అన్న బెంగతో— కన్నీళ్ళు కూడా తుడుచుకోలేక అవస్థపడుతూ వుంది నిర్మలమ్మ.

"ఏడుపెందుకే నాయుడమ్మా? ఇంకా యెందుకా నంగేడుపులు? ఇంకెంతమందికి పొంగలి పెట్టిద్దామని ఆ ముక్కుసీదదాలు? ఏ మొకం పెట్టుకోనా స్తివి? పదిమందిలో కెట్లాగొ స్తివి? ఛీఛీ! కాపురం ఒకడికి కొంగు మరొకడికా? నీదీ ఒక బతుకేనా? ఆ రాణెమ్మ జూడు! మంచికో చెడ్డకో గుండెక్కినోడే నా మొగుడనింది. గుండెక్కేసినాడు జగన్నాధుడన్నా రందరూ. వాడే మొగుడనుకొనింది. కర్మగాలి కాలుజారింది. గుండెక్కినోడేకదా నా మొగుడు. కాలు జారితే నాకేఁవి? కాలిపోతే నాకేఁవి? అను కొనిందా? లేదే! జగన్నాదుడే మొగుడను కొనింది. అట్టానే బతికింది. అదీ బతుకంటే! అదీ ఆడదంటే! నువ్వుండావు దేనికి? నీ పూజలు యే దేఁవు డందుకుంటాడే?" పూనకం పూనినవాడిలాగ అరుస్తున్నాడు బాలిగాడు.

"ఒరే! తక్కువజాతోడా? ఇప్పుడెందుకురా ఆ తక్కువ మాట్లు? నోరు మూస్తావా లేదా?"—నాయుడు కనుసన్నల్లో బతికేవాళ్ళు కండ్లెర్ర చేస్తున్నారు.

"ఒరే! బాలిగా! నీకు బుద్ధుందంట్రా? అప్పుడేఁవో గెడ్డం పట్టుకుని బతిమలాడి, నిజం చెప్పరాంటే, చేతిలో చెయ్యేసి నిజఁవే చెప్తానని కూసి, తీరా కోర్టులో నాకేఁవీ తెల్దని మొరిగిన కుక్కా! యిప్పుడెందుకురా కారు కూతలు కూస్తావు! ఏ దేవుడు మెచ్చుకుంటాడురా నువ్వు చెప్పే నిజం?"- ఒక పక్క ఈ గుట్టు రట్టు కావాలని నాయుడి ప్రతిపక్షం నవ్వుకొంటున్నా, మరొక పక్క నీతులు వివిరి నంగి మాటలు పలుకుతూ ఉంది.

"ఒరే మీవి పెద్ద పెద్ద జాతులేరా? అయితే మీమాదిరిగ పెద్దపెద్ద పనుల్జేసి బతకలేదురా నేను. పుట్టి బుద్దెరిగింది మొదులు నాయుణ్ణే నమ్ముకున్నా! బూవమ్మను నమ్ముకున్నా! బొట్టుబొట్టుగ సెవఁటోడ్చినా! నేనేగాదురా మీరను

కానే తక్కువ జాతోళ్ళంతా అట్టానే బతుకుతుండారు. కష్టపడడం మా వంతు. తెచ్చి మీ యిండ్లల్లో పోస్తే మెక్కడం మీ వంతు. మీరు తినంగా మిగిలింది మా మొకానిదిలిస్తే ఎంగిలి మెతుకులేరుకొని తిని బతకడం మా వంతురా! అయినా మీకు కనికారమేలేదు. కండ్లులేవు. ఉండినా కనిపించటం లేదు. నల్లిని నలిపినట్లు నలిపేస్తుండారు మా జాతిని!....అవున్రా! నేను తక్కువ జాతోణ్ణి. నిజ:వే! నిజ:వే చెప్పేస్తానని చేతిలో చెయ్యేస్తిని. నిజ:వే!— పిచ్చిబట్టి తిరిగితిని. నిజ:వే! ఈ పొద్దు ఎట్లెక్కినానో ఏ:వో ఆ ముత్తేలమ్మ తల్లికే తెలుసు. పులి గుండెక్కినాను. నిజ:వే!—అయితే జగన్నాధుడి మాదిరి ఆడదాని కోసరం గాదురా నేను గుండెక్కింది. నిజం సెప్పడానికి. నేను గాదురా గుండెక్కింది. గుండెక్కింది నిజంరా! నేను గాదురా మాట్లాడేది. మాట్లాడతా వుండేది నిజంరా! అందుకే యినండి. నాలాంటి తక్కువ జాతోడు మీలాంటి పెద్ద పెద్ద జాతోళ్ళ మద్దె నిలబడి నిజం సెప్పలేడురా! సెప్పి బతకలేడురా! అందుకే పులిగుండెక్కినా! మీరు కాదు కదా మీ లాంటోళ్ళబ్బలొచ్చినా యింక నన్నాపలేరు. ఇనండిరా యినండి!"

బాలిగాడి ఆవేశానికి హద్దు పద్దూ లేనట్టుంది.

పొంగలికి నీళ్ళు తెచ్చిచ్చి, పొయ్యికి యెండు పుల్లలు యేరిపెట్టి మిఠాయీలు కొనుక్కోవడానికి, రంగుల రాట్నంలో తిరగడానికి పైసల కోసం తల్లిదండ్రులను తోడుకతినే పిల్లలు సైతం అన్నిటినీ మరచి అదొక వేడుకగా పులిగుండు చుట్టూ చేరారు. ఇన్నాళ్ళుగా పిచ్చివాడుగా చెలామణీ అయి, యిప్పుడు పులిగుండెక్కిన బాలిగాడి మీద రాళ్ళు రువ్వడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నారు. నాయుడు పక్షం నాల్కలు కొరుకుతూంటే ప్రతి పక్షం ముసి ముసిగా నవ్వుకుంటూంది. గుండుమీద బాలిగాడు గుక్క తిప్పుకోకుండా వాగుతున్నాడు.

"పాపం! రా:వుడు. ఎంత మంచోడు వాడు. ఎంతందగాడు వాడు. అదేం కర్మమో? లేనోళ్ళకొంపలో పుట్టినాడు. పుడితేమాత్రం? ఎంత

మట్టూ మరేద? ఎంత గుట్టుగ కాలం గడపతావుండె. వాడు గొంతిప్పితే రాళ్ళు కరగతా వుండె! మణుసులు మాకుల్లా నిలబడతా వుండిరి. ఎట్లనో కన్నగసాట్లుపడి పదిదాక సదువుకుంటే, ఈ పాడులోకంలో వాడికేదైనా పని దొరికుంటే ఏ పట్నానికో ఎల్లిపొయ్యుండేవాడు. ఈ వూళ్ళో ఆ యింటి కాడ, ఈ యింటికాడ పాటలు పాడతా ఏ అమ్మో దయదల్చి అంత యిదిలిస్తే తిని బతకతావుండె. అట్లాంటి కన్నోరుమింద కన్నేస్తివే గదే నాయుడమ్మా! అయినా వాడేఁవన్నా లోబణ్ణా? ఈత మానుదేకడం, ఈడుగాని సావాసం సెయ్యడం తగదని తన్నుకుండె. అయినా వదిల్తివా? లేదే! నీ మాయదారి ఆటల్తో వాణ్ణి బుట్లో యేసుకుంటివి. వాడు మాత్రం యేం చేస్తాడు పాపం? పొంగుతుండే వయిసు. పత్తిని నిప్పును పక్కన పక్కన బెట్టి రగలద్దంటే వూరుకుంటిందా? రగిలిస్తివి. మంట మండిస్తివి. మట్టు బెట్టిస్తివిగదే నాయమ్మా! నాయుడమ్మా!! —"

పేదరాలి కడుపులో పుట్టిన రాముడు, గాలికి పెరిగిన రాముడు, కనుముక్కు తీరూ కోటేరేసినట్లు కనుచూపుకు యింపైన రాముడు, కమ్మగా పాడే రాముడు ఉన్నట్లుండి చంపబడ్డాడన్న వార్త పాయకట్టులో ప్రాకింది ఒకప్పుడు. గెవినిలో శవం పడివుండిందని, దానిని ఆధారంగా తీసుకొని కృష్ణమనాయుడంటే గిట్టని వాళ్ళు నాయుడి మీద కేసు బనాయించారని, తగిన సాక్ష్యం లేనందున కేసు వీగిపోయిందని పాయకట్టంతా తెలుసు కానీ దీని వెనుక యింత చరిత్ర యిమిడి వుందని ఎవరికీ తెలియదు. అందుకే ఆసక్తిగా వింటున్నారు.

"ఐనా నువ్వు మాత్రం యేంజేస్తావ్ నాయుడమ్మా? ఆ ముసిలి పీనిగెతో నువ్వేం సుకమనబస్తివి? అందుకే నువ్వు చేసిందేమీ పాప్మనుకోలేదు నేను. అయ్యో పాప్మమని పాలుపంచుకుంటి. నావల్ల అయింది నేను జేస్తి. ఎట్టా పసిగట్టినాడో పసిగట్టినాడు. పగబట్టినాడు. సిత్తూరుకి పొయ్యినట్టుగా పొయ్యి తిరిగొచ్చి యేఁవారించి సంపెనేరావుణ్ణి. నా కండ్ల ముందర పొడ్సి పొడ్సి సంపెనే! పొడ్సి సంపేసి రేత్రికి రేత్రే సిత్తూరు సేరుకుణ్ణే! పాపం!

రాఁవుడు. ప్రాణాలు వదులుతూ వాడు సూపిన సూపు. దిక్కులేని సావు సస్తూ వాడు సూపినసూపు? అబ్బ! గుండె జలదరిస్తా వుండాది. "ఒరే బాలిగా! నా తప్పేఁవీ లేదని నీకు తెల్సురా! బలంతంగా లాగింది ఆ మణిసే గదరా! వద్దని మొత్తుకుంటే కూడ వదలకుండా నీ ప్రాణానికి నా ప్రాణమిస్తానని నమ్మించింది తానేగదరా? దీన్ని లోకానికి సాటాల్సింది నువ్వేరా! లేకపోతే నా ఉసురుగొట్టి సస్తావు!" అని సూపినట్టుణ్ణె ఆ సూపు! ఆరునూరుగానీ, నూరారుగానీ, నిజం సెప్పేద్దామనుకొంటి. ఊళ్ళో యెదురు పార్టీవోళ్ళు, 'ఏఁవిరా? బాలిగా?' అంటే, మీమాటే నామాటంటి. పదండి సాఁవీ! అంటి. వాళ్ళేఁవో నా మాట నమ్మిరి. నా మాటమింద నేను నిలబడతాననుకుండ్రి. కోరట్టు కెక్కిరి. పోలీసోళ్ళకు తినబెట్టిరి. ఆ దెబ్బతో నాయుడు గెతి అదోగెతవుతుందనుకుండ్రి! నిజఁవే! నేనూ అట్టానే అనుకుంటి. నాయాలు నాయుడాట కట్టిందనుకుంటి. కాని వాడే నన్ను మెడబట్టి యింట్లోనుంచి బయటికిగెంటె. నా పూరి గుడిసెకు నిప్పుపెట్టె. మా యింట్లో దాన్ని, నన్ను. నా కసుగందుల్ని సెట్టుకింద నిలబడేట్టు సేసె. ఏఁవి సెయ్యమంటారు సెప్పండి? అంతటితో వొదిలిపెట్టెనా? లేదే! మా వాడవాడనే యిరకాటంలో యిరికించె. ఇరుక్కోని మేఁవు సస్తుంటే సకిలించె. అంతో యింతో సెయ్యిజాపి అప్పు తీసుకొన్నోళ్ల నిలువు కాళ్ళమింద నిలబెట్టి అప్పక్కడ బెట్టి కదలమనె. పెట్లేకపోతే సెట్లకు గట్టించికొట్టె. మా పంట పొలాలకు వాడి పొలాలమిందగా రావాల్సిన నీళ్ళనట కాయించె. పంటలు మలమల మాడిపోతుంటే వాడ వాడంతా ఒగిసై ఒకనాడు నా దగ్గరికొచ్చిరి!

"ఒరే! బాలిగా! యిదేఁవన్నా బాగుండాదంట్రా! నిన్ను జూసుకోని గదరా అపోజిట్టు పార్టీవోళ్ళు కోరట్టుకెక్కింది. అది జూసుకోనిగదరా నాయుడు మా మిందికెక్కి తొక్కతావుండేది. ఎట్లా సావమంటావురా ఈ సావు?....పోనీ! సచ్చినోడెట్లా సచ్చె! నువ్వు నిజంజెప్తే వాడు బతకపొయ్యేదీ లేదు. నాయుడు మమ్మల బతకనిచ్చేదీ లేదు. మమ్మల్నెందుకురా యిట్టా సంపతావు?... పుట్టే అప్పు పుట్టకుండా పాయ. పంటలేఁవో నిలవనా

ఎండిపోతుండాయి. ఈ పొద్దో రేపో వాడకు, నీ పూరి గుడిసెకు పట్టిన గతే పట్టేట్టుగా వుంది. మమ్మల్ని బతికించరా నీకు పున్నెం వుంటుంది." అని మొత్తుకుంద్రి. కన్నీరు మున్నీరుగా యేడిపించిరి. ఏం సెయ్యమంటారు సెప్పండి?

ఆ మరసట్రోజు. అర్ద రేత్రికాడ నాయుడే నేరుగా నా దగ్గిరికొచ్చె. సెట్టు కింద కడుపులో కాళ్ళు బెట్టుకొని పడుండిన నా పెళ్ళాం పిల్లల్నిసూసి కంటతడి బెట్టుకొనె.

"బాలిగా! ఎందుకొచ్చినకర్మరాయిది. జరిగిందేదో జరిగిపొయ్యింది. బుద్దెరిగిన నాట్నుండి పెట్టింది తిని, యిచ్చింది కట్టి నా పంచన బతికితివి. ఈ చేతులతోనే పెట్టి మళ్ళీ ఈ చేతులతోనే కొట్టాలంటే బాదగా వుంది. నా మాటినరా! నీకొక యెకరా పొలం యిస్తా. కాలిపోతే పొయ్యింది పూరి గుడిసె. మూడంకణాల యిల్లేసిస్తా. ఒక్కమాట సెప్పరా! నాకేవీ తెల్దని ఒక్కమాట సెప్పరా? ఒక్కటంటే ఒక్కమాట సెప్పరా! బాలిగా!" అని జాలిగా సేతులు పట్టుకుండె!

ఏం సెయ్యమంటారు సెప్పండి? .... ఈ అద్దోనపు గెతిలో నన్నేం సెయ్యమంటారు సెప్పండి? కూటికిలేక కుంవిలిపోతున్న పెళ్ళాం పిల్లలొక పక్క నాయుడి సేతిలో నలిగిపోతున్న నా వాళ్ళొక పక్క సమాళించుకో లేకపోతి అందుకే సెప్పేస్తి నాకేంవీ తెల్దని. కేసు కొట్టేసిరి. నాయుడు బయటపడె. ఆపోజిట్టు పార్టీ వోళ్ళు నామిందెగిరిపడ్రి. ఏం సెయ్యమంటారు సెప్పండి?"... గత స్మృతితో గిలగిలలాడి పోతున్నాడు బాలిగాడు.

పాయకట్టు ప్రజలు పులిగుండు కింద నిలబడి దిగ్భ్రమజెంది వింటు న్నారు. పొంగళ్ళు దించారు. మడివేలు మునిగాడు నోటికి గుడ్డ అడ్డంగా కట్టుకొని భయభక్తిగ తళిగలు వేయిస్తున్నాడు. చలిబిండి పిసికి, ప్రమిద లుగా చేసి, నూనెపోసి, వత్తివేసి తళిగకొక దివ్వె వెలిగించాడు. వేపచెట్టు నీడలో .... ముత్యాలమ్మ గుడిలో ...వేయితళిగలు.... వేయి దీపాలు.... దేదీప్యమానంగా వుంది. వేయి కుటుంబాలు పని గట్టుకొని అలంకరించడ

ములో ముచ్చటగా వుంది ముత్యాలమ్మ. బీదాబిక్కీ, పేదాసాదా తీర్థాకులు చేత పట్టుకొని అమ్మవారి ప్రసాదం కోసం ఎదురు చూస్తున్నారు.

ఎగ్గొట్టుక వస్తున్న ఏడుపును దిగమింగుకొన్నాడు బాలిగాడు. అందరి చెవుల్లో పడాలనియేమో గొంతు చించుకొంటున్నాడు బాలిగాడు.

"నాయుడు ఎకరా పొలం యిస్తాడని, మూడంకణాల యిల్లేసిస్తాడని, సీకుసింతా లేకుండా పచ్చంగా బతకచ్చని సంబరపడతా వుంటి. దినాలు గడిసె. వారాలు గడిసె. నెలలు తిరిగె. నాయుడరీగురీ మనకుండా వుండె. ఎదటబడి అడిగితే యేఁవన్నాడో తెలుసా? 'తక్కువ జాతి నా కొడకా! ఎకరా పొలం కావాల్నా? ఏఁవుడమ్మా మొగుడు సొత్తురా! యిల్లు కావాల్నా? అవును పాపం! కావద్దూ మరి?' అంటూ ఎగిరి తంతాడా? వాడు తన్నింది నన్నా? కాదు. నా తక్కువ జాతిని. ఈళ్ళ మోసేతి కింద నీళ్ళు తాగే తక్కువ జాతిని!"

తంతే ఏఁవయింది? నేను యీదిలో పడ్తిని. ఎదురు పార్టీ వోళ్ళ కండల్లో పడితిని. 'సెప్పింది ముందుగానే నాయుడి దగ్గర ఎందుకు లాక్కోలేక పోతివిరా ముదనష్టపోడా!' అని పెళ్ళాం ఆడిపోసింది. ఎదురు పార్టీ వోళ్ళు ఎకసక్కాలాడిరి. మొకాన వూసిరి. 'ఒరే బాలిగా! నేనడిగిందేఁవి? నువ్వు జేసిందేఁవి? సరిపోతుందంట్రా యిది?'' అని రాఁవుడు—సచ్చిన రావుఁడు దెయ్యఁవై పట్టుకుండె! నేను పిచ్చోడయితిని. నా పెళ్ళాం పిల్లలు గూడులేని గువ్వలైరి. ఈ ఎయ్య పొవ్వుల్లో మండే మంట నా నా కడుపు మంట. అదో అటుసూడండి!' అన్నాడు బాలిగాడు. శ్రద్ధగా చెవులు రిక్కించి వింటున్న ప్రజ తిరిగి చూచింది. బాలిగాడందుకొన్నాడు.

"ఒరే నాయుడూ! ముసిలిపీనిగా! పెండ్లాన్ని యేలుకోలేని యదవా? ఇంకా ఎందుకురా నీకా మీసం? మాటదప్పిన నువ్వా నేనారా తక్కువ జాతోడు? నేను నిజం సెప్తానంటే నా జాతినంతా నీ సేతుల్లో వుందని యిరకాటంలో పడేసి మీసం పడేస్తివి. లేని ఆశలు జూపించి నాతో అపద్దం

సెప్పించి అడిగితే ఎగిరి తంతివి. రెండిండ్లకు అగ్గిబెట్టి రొమ్ముగుద్దుకునే యదవా? జుట్లు పట్టించి యేడిక సూసే మంకు కుంకా? మాట దప్పిన మోస గాడా? ఎప్పటికైనా నీ కాలు గుంతలోనే లేరా? నీగెతి ఆముత్తేలమ్మతల్లే సూడాల్రా!"

"రే!....ఎయ్యరా!" అరుస్తున్నాడు కృష్ణమనాయుడు.

"నువ్వగాదురా? యింక నీయబ్బ ల్లేసొచ్చినా ఎయ్యలేర్రా! అందు కేరా గుండెక్కింది. గుండుమింద నిబ్బరంగా నిలబడుకుణ్ణా! నా కడుపు మంటతీరేదాకా తిట్టతా! — నా అక్కను అణిగిపొయ్యేదాక తిట్టతా!—నీ యాలితాడు పుటుక్కున తెగితిందిరా! నీ వంశం నాశనమైపోతిందిరా! నీ పెళ్ళాం పిల్లలు నా బిడ్డ లగోరించినట్టు గోడుగోడున యేడస్తార్రా!" తిట్ల దండకాన్ని అందుకున్నాడు బాలిగాడు.

దూరంగా "రే! యింకా సూస్తావెందుకురా? ఎయ్యరా!" అరుస్తు న్నాడు బిగ్గరగా నాయుడు. సర్గ్గానే వేశాడు ఒక్క వేటు మడివేలు ముని గాడు. తలా మొండెము రెండూ రెండు తునకలై రక్తపు మడుగులో పొరలాడుతూ వుంది నాయుడి కండబట్టిన పొట్టేలు.

"అయ్యో!....బాలిగా!!" ఒక్క పెట్టున అరిచింది గుండు చుట్టూ గుంపు.

తీర్రాకులు చేతబట్టి, మూడడ్డేళ్ళ పాత పేలిక గోచిగా పెట్టి ముత్యా లమ్మ ప్రసాదం కోసం ముచ్చటపడుతూ దూరంగా నిలబడి వుండిన బాలి గాడి బిడ్డలు....పట్టుమని పదేండ్లయినా నిండని పసిగందులు...."అయ్యో! నాయినా!" అంటూ పరుగులు దీశారు తీర్రాకులు విసిరికొట్టి.

"పొద్దు గూట్లో పడతావుందప్పుడే! కూర వుడకడాని కాలస్య మవుతుంది. తొందరగా ఎత్తండిరా పోట్టేల్ని" నాయుడు సేద్యగాళ్ళను తొందరపెడుతున్నాడు.

"అయ్యో!....అయ్యయ్యో!!....

ఉన్నట్లుండి జనసందోహంలో ఒకవైపు నుండి అరుపు వినబడింది. అందరి దృష్టి అటు మరలింది. ఎప్పుడు, ఎలాగ అంటుకొనిందో?—పట్టు చీర నిప్పంటుకొనింది. పరుగులు దీస్తూ వుంది నిర్మల ముత్యాలమ్మ గుడి వైపు. ధగధగ మండుతున్నాయి మంటలు. మధ్యలోనే పడిపోయింది. ముత్యాలమ్మను చేరుకోలేక పోయింది. లబలబ మొత్తుకుంటున్నాడు నాయుడు.

ఓ ఎముకలగూడు .... మట్టిపిసికి బతకడానికే నేర్చిన ఎముకల గూడు....అడుసుమడి లాంటి రక్తపు మడుగులో తునా తునకలైన తనువును ఒకటిగా చేర్చి, హృదయానికి హత్తుకోవడానికి అవస్థపడుతూ వుంది. అస్తవ్యస్తంగా చేరిన తనువు మీదపడి కన్నీరు మున్నీరుగా విలపిస్తూ వుంది.

బాలిగాడి గతివిని, జాలిగొని, మౌనయోగిని రాణెమ్మ మరొక్కసారి తీక్షణంగా పులిగుండువైపు చూచింది.

వెయ్యి కుటుంబాల ఎదురులేని పూజ!....బాలిగాడితో కలసి వెయ్యినొక్క ప్రాణువుల గావు....ఎర్రదనాన్ని ఎగ్గొడుతున్న పడమటి దిశ.... వెయ్యి బొవ్వల్లో ఎర్రటి మంట....లోకమే రక్తమయంగా రంజిలుతూంటే మురిసిపోతూ వుంది ముత్యాలమ్మ?

కలిగినవాని కంటి కావరానికి ప్రతీకగా....లేనివాడి నిస్సహాయతకు నిదర్శనంగా ధీమాగా నిలబడి వుంది పులిగుండు.

—ఆంధ్ర పత్రిక (26-4-74)